# తాగునీటి సమస్య తలెత్తనివ్వం

**రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు**



మొగల్తూరులో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

**మొగల్తూరు:** భవిష్యత్‌లో నియోజకవర్గంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మొగల్తూరులో జలజీవన్ మిషన్ నిధులు రూ.84.20 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాదరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇప్పటి వరకు తాగునీటి అవసరాల కోసం రూ.135 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. 45 గ్రామ పంచాయతీల్లో రూ.67 కోట్లతో పైప్‌లైన్ నిర్మాణాలతో పాటు ప్రతి ఇంటికీ కుళాయిలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మొగల్తూరులో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నీరందించేలా రెండు కిలో మీటర్ల మేర పైప్‌లైన్ ఏర్పాటుతో పాటు ఓహెచ్‌ఆర్‌లు, సంప్‌లకు జలజీవన్ మిషన్ నిధులను వెచ్చించినట్లు చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో మొగల్తూరులో సుమారు రూ.9 కోట్లు తాగునీటి కోసం ఖర్చు చేసినట్లు తెలిపారు. కొండావారి పాలెం, గుంటపల్లి పాలెం ప్రాంతాల్లో ఓహెచ్‌ఆర్‌లు, పైప్‌లైన్‌లు నిర్మించినట్లు చెప్పారు. రెండు లక్షల లీటర్ల కెపాసిటీ గల సంప్ పనులను త్వరలో ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మొగల్తూరు శివారు కొత్తకాయలతిప్పలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు కత్రి ఏసుబాబు, మోటుపల్లి రామ్ భాస్కరరావు, కటికల సూర్యారావు, కొల్లాబత్తుల రవి కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందాలి



మాట్లాడుతున్న చీఫ్ విప్ ప్రసాదరాజు

**మొగల్తూరు:** అర్హులందరికీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత వలంటీర్లదేనని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. మంగళవారం స్థానిక సీడీపీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్లు విధి నిర్వహణలో అలసత్వం వహించరాదని, విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. సచివాలయం 2 పరిధిలోని కొంత మంది వలంటీర్లు తమ పనితీరును మెరుగుపర్చుకోవాల్సి ఉందన్నారు. సమావేశంలో సర్పంచ్ పడవల మేరీ, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీలు కైలా సుబ్బారావు, కవురు సీతామహాలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మాజీ మంత్రి రంగరాజును కలిసిన ఎమ్మెల్సీ కుడిపూడి



మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ

**పెనుగొండ:** మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజును ఎమ్మెల్సీ కుడిపూడి సూర్యనారాయణ మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళవారం తాడేపల్లిగూడెంలోని నివాసంలో శ్రీరంగనాథరాజును కలిసి సత్కరించారు. కార్యక్రమంలో శెట్టిబలిజ జిల్లా కార్యదర్శి యాండ్ర శ్రీను, వైఎస్సార్ సీపీ నాయకులు దొంగా దుర్గాప్రసాద్, కుడిపూడి సుబ్రహ్మణ్యం, కుడిపూడి శ్రీను, గుత్తుల శ్రీను పాల్గొన్నారు.

### ఆలయాభివృద్ధిపై సమీక్ష



వడలిలో సమీక్షిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు

**పెనుగొండ:** వడలిలోని అగస్త్యేశ్వర స్వామి ఆలయాభివృద్ధిపై మంగళవారం దేవాదాయ శాఖ అధికారులు సమీక్ష నిర్వహించారు. ఆలయంలో రూ.1.59 కోట్లతో చేపట్టబోయే వాహనశాల, గ్రంథాలయం, ఆఫీసు రూమ్, పాఠశాల, యాత్రికుల వసతి గదుల నిర్మాణంపై చర్చించారు. ఆలయంలో నిర్మాణాలకు అవకాశం ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాసాని విజయలక్ష్మీ పెద్దిరాజు, ట్రస్ట్ బోర్డు చైర్మన్ గుర్రం నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన దుర్గాభవానీ బాబీ, ఆలయ కార్యనిర్వహణాధికారి మన్నే శ్రీనివాసరావు, స్థపతి వీరవాసరపు సూరిబాబు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### దాతల సహకారం అభినందనీయం



కంచాలు పంపిణీ చేస్తున్న దాతలు

**పెనుగొండ:** ప్రభుత్వ పాఠశాలల్లో సంక్షేమ పథకాల అమలుతో పాటు, విద్యార్థులకు దాతల దాతృత్వం అభినందనీయమని చెరుకువాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భరణీ కుమార్ అన్నారు. మంగళవారం పెనుగొండ సాయి బాలాజీ ఫుడ్ ప్లాజాకు చెందిన భోగరాజు శ్రీనివాసరావు, గుర్రాల శ్రీనివాసరావులు 100 కంచాలు విద్యార్థులకు బహుకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ శ్రీనివాస్(బాబ్జి), ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

**పెనుగొండ:** ఆచంటలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి మూడో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఇందుకూరి వెంకట సత్యనారాయణ రాజు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొదటి రెండు కౌన్సెలింగ్‌ల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 27వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆచంటలోని ఐటీఐ కళాశాలలో దరఖాస్తులు అందించాలని సూచించారు. 30వ తేదీ ఉదయం 10 గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. మిగిలిన వివరాలకు సెల్ నెంబర్ : 94901 11002లో సంప్రదించాలని సూచించారు.

# ప్రతిపక్ష సభ్యుల సలహాలు స్వీకరిస్తాం

**ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు**



నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు

**నరసాపురం రూరల్:** పట్టణాభివృద్ధిలో ప్రతిపక్ష సభ్యుల సలహాలను స్వీకరించి, వాటిని ఆచరణలో పెడతామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రె శ్రీవెంకట రమణ అధ్యక్షతన మంగళవారం జరిగిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యే ప్రసాదరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని అధిగమించి నరసాపురం మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామన్నారు. నరసాపురం అభివృద్ధే అంతిమ లక్ష్యంగా పనిచేసుకుంటూ ముందుకు వెళ్తున్నామని తెలిపారు. బస్టాండ్, ప్రభుత్వాసుపత్రి, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సుందరమైన శ్మశాన వాటిక, ప్రజలందరికీ పరిశుభ్రమైన తాగునీటిని అందించేందుకు నూతన పైప్‌లైన్ వ్యవస్థ, కళ్యాణ మండపం, పార్కుల అభివృద్ధి, లైబ్రరీ నిర్మాణం, సబ్ సెంటర్లు, ఏటిగట్టు అభివృద్ధి ఇలా ప్రతి పనిని అభివృద్ధి చేసుకున్నామన్నారు. ప్రతిపక్ష సభ్యులైనప్పటికీ అభివృద్ధిలో భాగస్వాములయ్యేలా మంచి సలహాలు ఇవ్వాలని సూచించారు. వారి అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళతామన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో అధికారులు పూర్తిగా నిమగ్నమై ఉండాలని సూచించారు. రెండో విడత గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా వార్డుకు రూ.10 లక్షలు చొప్పున ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు అభివృద్ధి పనులకు కేటాయిస్తామన్నారు. ఈ సందర్భంగా పలుచోట్ల రోడ్లు, కల్వర్టులు, తాగునీటి పైపులైన్లు నిర్మించుటకు, రానున్న ఎన్నికల దృష్ట్యా పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు కౌన్సిల్ సభ్యులు ఆమోదించారు. సమావేశంలో ఏడిదకోట సత్యనారాయణ, కేసరి గంగరాజు, కామన నాగిని, సఖినేటిపల్లి సురేష్, జిల్లెళ్ల దిలీప్ తదితరులు తమ వార్డుల్లోని సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై మాట్లాడారు.

# అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి



గోపిని సత్కరిస్తున్న పాలకొల్లు ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు

**వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి**

**పాలకొల్లు అర్బన్:** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. పాలకొల్లు మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం జరిగిన అధికారులు, ఎంపీటీసీ సభ్యుల సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ముందుగా ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి ఆధ్వర్యాన ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ ఉద్యోగులు గోపిని పరిచయం చేసుకుని పుష్పగుచ్ఛాలతో సత్కరించారు. అనంతరం గోపి మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులకు అన్నివేళలా అందుబాటులో ఉంటానన్నారు. ఏ చిన్న సమస్య ఉన్నా తనను నేరుగా సంప్రదించవచ్చన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోనన్నారు. అధికారుల పనితీరును బట్టి రాబోయే రోజుల్లో తన గెలుపు నల్లేరు మీద నడకలా సాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గోపిని సత్కరించిన వారిలో మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు యన్నాబత్తుల నాగేశ్వరావు, పడవల సునీల్ బాబు, ఎంపీటీసీ సభ్యులు చింతపల్లి సాయిబాబా, మేడిది స్వర్ణ, యాండ్ర శైలజ, కో ఆప్షన్ సభ్యులు తండా ఇస్సాక్ రాజు, పెదపాటి వెంకటరత్నం, పంచాయతీ కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

### జాయింట్ కలెక్టర్ పరామర్శ



చికిత్స పొందుతున్న వ్యక్తితో కింద కూర్చుని మాట్లాడుతున్న జేసీ రామసుందర్‌రెడ్డి

**పాలకొల్లు సెంట్రల్/యలమంచిలి:** యలమంచిలి మండలంలోని కట్టుపాలెం–ఇలపకుర్రు పంచాయతీ సంగటిరేవు గ్రామాల సరిహద్దులో రోడ్డు పక్కన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి గత వారం రోజులుగా ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆ వ్యక్తిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి పూర్తిగా ఆరోగ్యం కుదుటపడే వరకు చికిత్స చేయించాలని యలమంచిలి తహసీల్దార్‌కు ఆదేశాలిచ్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. సుమారు 45 ఏళ్ల వయస్సున్న అతను మాటలు సరిగ్గా చెప్పకపోవడంతో అడ్రస్ తెలియలేదు. అతనిని మంగళవారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి వచ్చి పరామర్శించారు. అతనికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. ఆరోగ్యం కుదుటపడిన తరువాత కుటుంబ సభ్యుల ఆచూకీ తెలుసుకుని వారికి అప్పగించాలని ఆయన ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ వెంట యలమంచిలి తహసీల్దార్ మాతా సునీల్‌కుమార్, వీఆర్వో ఘనలక్ష్మి ఉన్నారు.

### నేరాల అదుపునకు ప్రత్యేక డ్రైవ్

**ఆకివీడు :** పట్టణం, మండలంలో దొంగతనాలు, చట్ట వ్యతిరేక కార్యక్రమాల్ని అరికట్టేందుకు ఆకివీడు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు రూరల్ సీఐ కేవీవీఎస్ సత్యనారాయణ, ఎస్సై ఎ.ఫణిమోహన్ చెప్పారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. నేరాల్ని అరికట్టేందుకు పోలీస్ నైట్ బీట్‌లు, సీసీ కెమెరాలు, సచివాలయ పోలీస్ యంత్రాంగం సహకారంతో ముందుకు వెళ్లుతున్నామని చెప్పారు. పట్టణంలో గంజాయి వినియోగం, ఆకతాయిల బెడద, దొంగతనాలు జరుగుతున్న దృష్ట్యా ప్రత్యేక నిఘాతో వీటిని అరికడతామన్నారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. తమ పిల్లలు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే అటువంటి వారికి కౌన్సిలింగ్ ఇస్తామన్నారు. గంజాయి అమ్మకం, కొనుగోలు, రవాణా వంటివి చేపట్టినా, వాటికి సహకరించిన వ్యక్తులకు జరిమానాలు, శిక్షలు కఠినంగా ఉంటాయని సీఐ సత్యనారాయణ, ఎస్సై మోహన్ హెచ్చరించారు.

### ఉచిత గుండె వైద్య శిబిరం

**భీమవరం(ప్రకాశంచౌక్):** స్థానిక మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో మంగళవారం ఉదయం గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

# 28న వ్యవసాయ కార్మికులకు శిక్షణ



ప్రచారం చేస్తున్న సంఘ నాయకులు

**నరసాపురం రూరల్:** ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ఈనెల 28న వేములదీవి పడమర గ్రామంలోని గొంది మూల సెంటర్‌లో వ్యవసాయ కార్మికులకు శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు కవురు పెద్దిరాజు, జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం వేములదీవిలో ఇంటింటికీ తిరిగి ప్రచారం చేస్తూ విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో యాంత్రీకరణ, ఆక్వా, రియల్ ఎస్టేట్ తదితర మార్పులు వచ్చిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకం కీలకంగా మారిందన్నారు. ఈ పథకాన్ని మోదీ ప్రభుత్వం నీరు గార్చేందుకు కేంద్రంలో అనేక మార్పులు చేస్తూ బడ్జెట్లో నిధులు తగ్గిస్తోందన్నారు. కూలీలకు యాప్ ద్వారా మస్టర్ వేసే విధానాన్ని రద్దు చేయాలని, కోరిన వారందరికీ పని కల్పించాలన్నారు. పనిదినాలను 200 రోజులకు పెంచి కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బాతిరెడ్డి జార్జి, జల్లి రామ్మోహనరావు, కవురు శ్రీను, భాస్కరరావు, గుత్తుల ప్రసాద్, కేతా రామారావు తదితరులు మాట్లాడారు.

# ఓటు నమోదు చేసుకోండి



మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

**నరసాపురం రూరల్:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక రాయపేటలోని శ్రీ గౌతమి జూనియర్ కళాశాలలో ఓటుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ, యువకులంతా ఓటరుగా తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు గానూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గౌతమి విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ చినమిల్లి దుర్గాప్రసాద్, సూపరింటెండెంట్ ఎండీ గఫర్‌ఖాన్, ఎం.రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ భద్రతా దళాల్లో చేరేందుకు ఆసక్తి చూపండి

**రిటైర్డ్ మేజర్ జనరల్ బీవీ రావు**



బీవీ రావును సన్మానిస్తున్న స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

**నరసాపురం రూరల్:** విద్యార్థులు జాతీయ భద్రతా దళాల్లో పనిచేసేందుకు ఆసక్తి చూపాలని తణుకుకు చెందిన రిటైర్డ్ మేజర్ జనరల్ బీవీ రావు అన్నారు. మంగళవారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ భద్రతా దళాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బీవీ రావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ భద్రతలో సాయుధ దళాల పాత్ర, పౌరుల బాధ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అంతేకాక విద్యార్థులు త్రివిధ దళాల్లో ఏ విధంగా ప్రవేశించాలో అనే దానిపై సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం కళాశాల చైర్మన్ కేవీ సత్యనారాయణ, ట్రెజరర్ కేవీ స్వామి, పాలకవర్గ సభ్యులు బీవీ రావును ఘనంగా సత్కరించారు. వైస్ ప్రిన్సిపాల్ గోపిచంద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమం జగనన్న లక్ష్యం

**ఉండి :** ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణ రాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ అన్నారు. మంగళవారం ఉండి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఎలక్ట్రికల్ ఏఈగా ఎంపికైన ఎం.మాధవరాజు, ఆకివీడు సీఐగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సత్యనారాయణలను ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేసినా, నీచంగా మాట్లాడినా అడిగే నాథుడే లేడన్నారు. కానీ జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పాలన విజయంలో అహర్నిశలు శ్రమిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు మంచి చేసేందుకు సీఎం వైఎస్ జగన్ ఎప్పుడూ ముందుంటున్నారని అన్నారు. డీఏలు అందించడం, ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా వారికి కావాల్సిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. అనంతరం మండలంలోని అన్ని శాఖల పనితీరుపై ఆరా తీశారు. ముఖ్యంగా విద్యాశాఖ మరింత మెరుగ్గా పనిచేసి డ్రాప్ అవుట్స్ లేకుండా చూడాలన్నారు. తాగునీటి కాలుష్యం, పశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రధాన సెంటర్లలో, ఉండి రైల్వేగేట్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాల ఏర్పాటు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

### వాండ్రంలో దళితుల నిరసన

**ఉండి :** వాండ్రంలో లూథరన్ చర్చ్‌పై దాడికి తెగబడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని లేకుంటే రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలుపుతామని స్థానిక దళితులు అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం వాండ్రంలో చర్చ్ వద్ద దళితులు ప్రార్థనలు చేస్తూ నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు గరికిముక్కుల సామేలు, కోనాల రాజేంద్ర, విప్పర్తి మహేష్, పాము మధు, మంద వర్మ, బందుల ఇజ్రాయేలు, మందా రూబేన్, గోరింకల ఏసేబు మాట్లాడుతూ గ్రామంలో జరిగిన కొట్లాటలో ఇరువర్గాలు పోలీసులకు ఫిర్యాదులు చేసుకున్నారన్నారు. అయితే మూకుమ్మడిగా చర్చ్‌పై దాడికి తెగబడాల్సిన అవసరం ఏం వచ్చిందని వారు ప్రశ్నించారు. దాడి విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైనా ఇప్పటికు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అన్నారు. వెంటనే అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయాన్ని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు మేడిద జాన్సన్ దృష్టికి తీసుకువెళ్లామని, వారంతా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

### నేడు గుడాల పర్యటన

**యలమంచిలి:** మండలంలోని కంచుస్తంభంపాలెం, బూరుగుపల్లి, దొడ్డిపట్ల, అబ్బిరాజుపాలెం, గంగడుపాలెం, నారినమెరక గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పర్యటిస్తారని పార్టీ మండల కన్వీనర్ పొత్తూరి బుచ్చిరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు నియోజకవర్గానికి ఈశాన్య గ్రామమైన కంచుస్తంభంపాలెంలో ఆయన పర్యటన ప్రారంభమై ఒంటి గంటకు నారినమెరక గ్రామంలో ముగుస్తుందని పేర్కొన్నారు. గోపి ఆయా గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలను కలుసుకుని పరిచయం చేసుకుంటారని ఆయన తెలిపారు.

### 29న యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

**యలమంచిలి:** యలమంచిలి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 29వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి తెలిపారు. ఎంపీపీ రావూరి వెంకటరమణ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో గత మూడు నెలల్లో మండలంలోని 32 గ్రామాలలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు రాబోయే మూడు నెలల్లో చేపట్టే పనులపై అధికారుల నుంచి నివేదిక తీసుకుంటారని ఆయన వివరించారు.

### లక్ష్మీనారాయణ ఎన్నికపై హర్షం

**పెనుగొండ:** 'అరసం' అఖిల భారత అధ్యక్షునిగా ప్రముఖ సాహితీవేత్త పెనుగొండ లక్ష్మీనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక కావడం పట్ల కవి, రచయిత ఎస్కే నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పెనుగొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జబల్పూర్ సదస్సులో లక్ష్మీనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వివరించారు. లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితల సంఘం(అరసం) విస్తృత కార్యక్రమాలను చేపట్టి జనజాగృతికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

### వ్యక్తికి తీవ్ర గాయాలు

**భీమవరం అర్బన్:** భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి తీవ్ర గాయమైంది. తాడేరు గ్రామానికి చెందిన బండారు గిరి వెంకటరావు పాల ప్యాకెట్లు కొనుగోలు చేసి ఇంటికి వస్తుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. వెంకటరావు కాలికి తీవ్ర గాయమైంది. అతని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**ప్రకటన**

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, పాలకొల్లు వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్లు దాఖలా ఆస్తిని శ్రీమతి అల్లూరి లక్ష్మి భర్త సుబ్బరాజు మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల లోపల మాకు తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవు. రాజానగరం సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.6208/2014, కవ్వరం గ్రామానికి చెందిన ఆర్.యస్.నం.498/1, ప్లాట్ నం.20లో 260 చ.గ. స్థలానికి హద్దులు : తూర్పు: రోడ్డు, పడమర ప్లాట్ నం.15, ఉత్తరం : ప్లాట్ నం.18&19, దక్షిణం : ప్లాట్ నం.21.

పి.డి.యస్.వి.బాలాజీ బి.కాం., బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు, సెల్ నం.94904 33732

**ప్రకటన**

నా క్లయింట్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ పాలకొల్లు వారు నాకిచ్చిన సంజాయిషీ ప్రకారం తెలియజేయునది ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తిని శ్రీ ఆరేటి రామారావు తండ్రి ఆదినారాయణ మార్టుగేజ్ చేయడానికి అంగీకరించారు. సదరు ఆస్తిపై ఏ విధమైన అభ్యంతరములు ఉన్నా ఈ ప్రకటన వెలువడిన వారం రోజుల లోపల మాకు తెలియజేయవలెను. తరువాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబడవు. మొగల్తూరు సబ్‌రిజిస్ట్రార్ డాక్యుమెంట్ నం.140/2023. ఆర్.యస్.నం.708/1సిప్లిర్గం 96–8 చ.గ. మొగల్తూరుకు చెందిన స్థలానికి హద్దులు : తూర్పు: పుంత, పడమర రావని దర్మారావు భూమి, ఉత్తరం : కె.శంకర దుర్గాప్రసాద్, దక్షిణం : ఆరేటి నాగేశ్వరి స్థలం.

పి.డి.యస్.వి.బాలాజీ బి.కాం., బి.ఎల్., అడ్వకేటు, పాలకొల్లు, సెల్ నం.94904 33732

# ప్రతి వారం వస్తా.. సమస్యల్ని పరిష్కరిస్తా

- వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల గోపి
- ఎల్‌అండ్‌టీ కాలనీ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలన



పాలకొల్లు ఎల్‌అండ్‌టీ కాలనీలో ప్రజల సమస్యల్ని తెలుసుకుంటున్న గోపి

**పాలకొల్లు అర్బన్:** ఎల్‌అండ్‌టీ కాలనీని ప్రతి వారం సందర్శించి స్థానికుల సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) హామీ ఇచ్చారు. పాలకొల్లు శివారు పెంకుళ్లపాడులోని ఎల్‌అండ్‌టీ కాలనీని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీవాసుల సమస్యలను ఆయన స్వయంగా తెలుసుకున్నారు. శాంతి కమిటీ సభ్యులు మీరా ఉన్నీసా, పి.రమ్య, విజయ దుర్గాభవాని, సుబ్రహ్మణ్యం తదితరులు పలు సమస్యలను గోపి దృష్టికి తీసుకువచ్చారు. పార్కు వద్ద వీధి లైటు, నాలుగు రోడ్ల కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే తాగునీటి పైపులైన్‌లు లీకవుతున్నాయని, ఎల్‌అండ్‌టీ అపార్టుమెంట్ల వద్ద పిచ్చి మొక్కలు పెరిగిపోయి పాములు వస్తున్నాయని, కాలనీకి తూర్పుభాగంలో డ్రెయినేజీ నీరు నిలిచిపోవడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు గోపికి చెప్పారు. తాగునీటి పైపులైన్ లీకవుతున్న అపార్టుమెంట్లలో నాలుగో అంతస్తు వరకు వెళ్లి ఆయన పరిశీలించారు. దీనిపై మునిసిపల్ డీఈ సాంబశివుడు, అధికారులతో సమస్యలన్నింటిపై చర్చించారు. తక్షణమే పిచ్చి మొక్కలు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. అలాగే వీధి లైట్లు, స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు. ఆయన వెంట చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పట్టణ, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, ఎం.మైఖేల్‌రాజు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు తదితరులున్నారు.

**వార్డు ఇన్‌ఛార్జ్‌ల సూచనల మేరకే..**

ఏఎంసీ అతిథి గృహంలో పట్టణంలోని 31 వార్డుల ఇన్‌ఛార్జ్‌లతో గోపి సమావేశమయ్యారు. వార్డులో అభివృద్ధి పనులు, ఇతర సమస్యలన్నింటిపైనా వార్డు ఇన్‌ఛార్జ్ సూచనల మేరకు ముందుకు వెళతానని గోపి స్పష్టమైన హామీ ఇచ్చారు. పట్టణంలో డ్రెయినేజీ, పారిశుధ్యం, రోడ్లు ఇతర అభివృద్ధి పనులకు వార్డు ఇన్‌ఛార్జ్‌లు జాబితాలు సిద్ధం చేస్తే గడప గడపకు మన ప్రభుత్వం రెండో విడత నిధులతో ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు ఇన్‌ఛార్జ్‌లు రావి నాగేశ్వరరావు, ధనాల శ్రీనివాస్, చినిమిల్లి గణపతిరావు, శీలం సూరిబాబు, మద్దా చంద్రకళ, చదలవాడ శ్యాంబాబు, రామాంజుల పెద మధు, పాలపర్తి కృపానాథ్, బండి రమేష్, తదితరులు పలు సమస్యలను గోపి దృష్టికి తీసుకువచ్చారు. అంతకు ముందు మునిసిపల్ వాటర్ వర్క్స్‌ను గోపి పరిశీలించారు.